AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి..



**అక్షరటుడే, ఆర్మూర్:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఆర్మూర్ అర్బన్ క్రీడలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల క్రీడాకారులు హాజరై మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం విజేతలకు ఏసీపీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎంఈవో రాజ గంగారాం, హెచ్‌ఎం లక్ష్మి నర్సయ్య, పీడీ మల్లేష్ గౌడ్, ఉపాధ్యాయులు దయాసాగర్, విజయ్ కుమార్, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


14-10-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2




## ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద..

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద నీరు కొనసాగుతోంది. దీంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ లోకి ప్రస్తుతం 22,290 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్ల ద్వారా 12,500 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 3 వేలు, కాకతీయ కాలువ కు 5 వేలు, సరస్వతి కాలువకు 650, లక్ష్మి కాలువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 80.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

### నిజాంసాగర్‌లోకి..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 12,662 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. వరద గేట్ల ద్వారా 12,362 క్యూసెక్కులు నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రధాన కాలువకు 300 క్యూసెక్కులు వదులుతున్నారు. ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో సమానంగా ఉండడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రస్తుతం జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వతో నిండుకుండలా ఉంది.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక రుణాలు



**అక్షరటుడే, ఇందూరు:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక ఇబ్బందులు ఉంటే మెప్మా మహిళా సంఘాల ద్వారా ప్రత్యేక రుణాలు అందజేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ పీడీ పవన్ కుమార్ తెలిపారు. నగరంలోని కాలూరులో మంగళవారం అంగీకార్-2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఆయా దశల్లో రూ.5 లక్షలు ఆర్థిక చేయూతనందిస్తుందని తెలిపారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, ఏఈ భూమేశ్వర్, వార్డు ఆఫీసర్ దినేష్, హరినాథ్, ప్రశాంత్, మెప్మా సీవో సరిత పాల్గొన్నారు.


## 21 నుంచి పోలీస్ సంస్మరణ వారోత్సవాలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో పోలీస్ సంస్మరణ వారోత్సవాలు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. పోలీసు అమరుల త్యాగాలను గుర్తుచేస్తూ ఈనెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కమిషనరేట్ పరిధిలో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న జనరద్దీ గల ప్రదేశాల్లో, ఆర్టీసీ బస్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో బ్యానర్లు, హోర్డింగ్‌లు, పోస్టర్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. 21న జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమరవీరుల దినోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. 22, 24న అమరవీరుల కుటుంబాలను పరామర్శించనున్నట్లు వివరించారు. 23న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే షార్ట్ ఫిలిం కాంపిటేషన్, ఫొటోగ్రఫీ పోటీ ఉండనుంది. 25న సైకిల్ ర్యాలీ, బైక్ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. 26న కానిస్టేబుల్ నుండి ఏఎస్సై వరకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. 27, 28న ప్రజల మౌలిక సదుపాయాలను తెలుసుకునే కార్యక్రమం, 29న పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరం, 30న ఆన్‌లైన్ ద్వారా ఓపెన్ హౌజ్, 31న క్యాండిల్ ర్యాలీ చేపట్టనున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా పార్టీ జిల్లా అధ్యక్షుల నియామక ప్రక్రియను చేపట్టింది. కాగా.. నిజామాబాద్, కామారెడ్డి డీసీసీ అధ్యక్షులను నియమించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. అయితే నిజామాబాద్‌లో ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ముగియగా కామారెడ్డిలో ఈనెల 18 వరకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో పదవుల కోసం నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దీంతో రెండు జిల్లాల డీసీసీ అధ్యక్ష పీఠాలు ఎవరికి దక్కుతాయనే ఆసక్తి నెలకొంది.

- అక్షరటుడే, కామారెడ్డి



# డీసీసీ పీఠం దక్కేదెవరికో..!

- ఉమ్మడి జిల్లాలో అధ్యక్ష పదవులకు పోటాపోటీ
- నిజామాబాద్‌లో 17 మంది నేతల దరఖాస్తు
- కామారెడ్డిలో 18 వరకు ఛాన్స్

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవుల కోసం నాయకులు పోటీ పడుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే పైరవీలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేలు సైతం అధ్యక్ష పదవిపై తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

### ఉమ్మడి జిల్లాలో తీవ్రపోటీ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో డీసీసీ అధ్యక్షుల పదవులకు తీవ్ర పోటీ నెలకొంది. ముఖ్య నాయకులు పోటీకి సన్నద్ధమయ్యారు. ముఖ్యంగా అందరి చూపు నిజామాబాద్ వైపే ఉంది. ఇక్కడ టీపీసీసీ అధ్యక్షుడిగా నిజామాబాద్‌కు చెందిన మహేశ్ కుమార్ గౌడ్ ఉండడం, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఉండడం కీలకంగా వ్యవహరిస్తుండడంతో పదవి పోటీపై ఆసక్తి నెలకొంది. అలాగే మాజీ మంత్రి షబ్బీర్ అలీ ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతూ నిజామాబాద్ ఇన్‌ఛార్జీగా ఉన్నారు. ఈ క్రమంలో ఎవరికి ఎక్కువ మద్దతు లభిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

### నిజామాబాద్‌లో 17 మంది..

నిజామాబాద్ జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవికి భారీగానే దరఖాస్తులు వచ్చాయి. 17 మంది అధ్యక్ష పీఠం రేసులో ఉన్నారు. వీరంతా ఇప్పటికే పార్టీ అధినాయకత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో నిజామాబాద్‌కు చెందిన నరాల రత్నాకర్, చంద్ర శేఖర్ గౌడ్, సాయికుమార్, ఎం.సాయిరెడ్డి, ముజ్జు పటేల్, ఇమ్మడి గోపి, జగడం సుమన్, మహమ్మద్ జనీద్ అక్రమ్, ఎంఏ.హలీం, బాడ్సి శేఖర్ గౌడ్ ఉన్నారు. ఆర్మూర్‌కు చెందిన నేత అయ్యప్ప శ్రీనివాస్, బాల్కొండ నుంచి వేణుగోపాల్ యాదవ్ తదితరులు దరఖాస్తు ఇచ్చారు. కాగా.. అధిష్టానం ఏ ప్రాతిపదికన అవకాశం ఉందనే ఉత్కంఠ నెలకొంది. ఏ సామాజిక వర్గానికి చెందిన వారికి పదవి అప్పగిస్తారనే చర్చ సాగుతోంది.

### ఏఐసీసీ పరిశీలకుల సమావేశాలు

పార్టీ అధ్యక్షుల ఎంపిక కోసం పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఇందుకోసం పార్టీ అధిష్టానం ప్రత్యేకంగా పరిశీలకులను నియమించింది. వారు ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే జిల్లా నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుతం నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ నెల 19 వరకు నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి తుది నివేదికను పార్టీ అధిష్టానానికి సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల డీసీసీ అధ్యక్ష పదవులు ఎవరికి దక్కుతాయనే చర్చ కొనసాగుతోంది.

### కామారెడ్డిలో ప్రధానంగా ముగ్గురు..

కామారెడ్డి జిల్లాలో ప్రస్తుతానికి జిల్లా అధ్యక్ష పదవికి ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నిజాంసాగర్ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, వర్ని మండలానికి చెందిన రాజిరెడ్డి డీసీసీ రేసులో ఉన్నారు. మల్లికార్జున్ అభ్యర్థిత్వాన్ని ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు సమర్థిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. కామారెడ్డిలో ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. మంగళవారం కామారెడ్డి పట్టణంలో ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ కరోలా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కైలాస్ శ్రీనివాస్‌రావును తిరిగి నియమించాలని పలువురు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

## మద్యం టెండర్లకు 193 దరఖాస్తులు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో 49 మద్యం షాపులకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం వరకు 106 దరఖాస్తులు రాగా.. సోమవారం, మంగళవారం రెండు రోజుల్లోనే 83 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని కామారెడ్డి స్టేషన్ పరిధిలో మొత్తం 15 వైన్ షాపులకు 54 దరఖాస్తులు, దోమకొండ స్టేషన్ పరిధిలో 8 దుకాణాలకు 32, ఎల్లారెడ్డి పరిధిలో మొత్తం ఏడు వైన్ షాపులకు 25, బాన్సువాడ పరిధిలో తొమ్మిది దుకాణాలకు 44, బిచ్కుంద పరిధిలో 10 వైన్ షాపులకు 38 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉందని, ఆసక్తి కలిగిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్ రావు కోరారు.



## విద్యార్థినులకు బస్సు సౌకర్యం..

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణ శివారులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఎమ్మెల్యే పోచారం బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. మంగళవారం ఆయన తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయానికి వెళ్తుండగా.. విద్యార్థులు రోడ్డుపై నిలబడడాన్ని గమనించారు. బస్సులు లేక అవస్థలు పడుతున్నామని వివరించడంతో పోచారం స్పందించారు. వెంటనే బాన్సువాడ డీఎం రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి ఉదయం, సాయంత్రం విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.



## 23న కపిలధార్ మన్మథ స్వామి పుణ్యక్షేత్రానికి పాదయాత్ర

**అక్షరటుడే, బోధన్ :** పట్టణంలోని పురాణే మఠం ఆధ్వార్యంలో కపిల ధార్ మన్మథ స్వామి పుణ్యక్షేత్రానికి పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం యాత్రకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర వీరశైవ లింగాయత్ సమాజ్ ప్రతినిధి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు దేశాయ్ ఆవిష్కరించారు. అక్టోబర్ 23న చక్రేశ్వరాలయం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. యాత్ర నవంబర్ 5న కార్తీక పౌర్ణమి నాటికి మన్మథస్వామి చేరుకుంటుందన్నారు.



## షేక్‌పేట్‌లో పార్టీ కార్యాలయాన్ని పరిశీలించిన జీవన్‌రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో షేక్ పేట్ డివిజన్‌లో ప్రచారం ఊపందుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో కలిసి నిజామాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పరిశీలించారు. కార్యాలయంలో కార్యకర్తల కోసం ఏర్పాటు చేస్తున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పోరాడాలని సూచించారు.



## ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో అవగాహన కార్యక్రమాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులు, మైనర్ డ్రైవింగ్ చేసే వారికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ భవనాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. టీటీఐలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, మైనర్ డ్రైవింగ్ చేసిన వారికి అవగాహన కల్పించడంతో పాటు ఈ భవనాన్ని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌గా ఉపయోగించబోతున్నామన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంచే దిశగా ఈ సెంటర్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఎస్పీ వివరించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలపై శిక్షణ ఇవ్వడం, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలు ఈ సెంటర్ ద్వారా నిర్వహించబడతాయని పేర్కొన్నారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలంటూ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్‌కు సూచించారు. జిల్లా ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## 17 నుంచి లలితా చంద్రమౌళీశ్వరాలయ ప్రారంభోత్సవాలు

**అక్షరటుడే, ఇందూరు:** శృంగేరి శంకరమఠం ఆధ్వర్యంలో బాసరలో శ్రీ లలితా చంద్రమౌళీశ్వర ఆలయ ప్రారంభోత్సవం, కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిమిల్ల హరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బాసరలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి 19 వరకు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఆలయంలో వేద పాఠశాల, భక్తులకు ప్రసాద వితరణ, వసతి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ నిర్మాణాన్ని నిజామాబాద్ నగరంలోని లలితా ఆశ్రమ ఆలయ వ్యవస్థాపకులు దివంగత వేలేటి సుధాకర్ శర్మ కోరిక మేరకు భక్తులు, ప్రముఖుల సహకారంతో నిర్మించామన్నారు. సమావేశంలో ఆలయ ముఖ్య నిర్వాహకులు శ్వేలేటి రాజేందర్ శర్మ, మోటూరు వెంకటేశం, బచ్చు గోపాల్, సంతోష్, అభిషేక్, సతీష్‌రావు తదితరులు పాల్గొన్నారు.




## మాతాశిశు ఆస్పత్రిలో గర్భిణుల అవస్థలు



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో గర్భిణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.. వైద్యం కోసం తెల్లవారుజామునే ఆస్పత్రికి చేరుకునే గర్భిణులు గంటల తరబడి ఆస్పత్రిలో నిరీక్షిస్తున్నారు. కానీ వారికి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండట్లేవు. కూర్చోవడానికి కుర్చీలు లేక చాలామంది నేలపైనే కూర్చుని వైద్యం కోసం వేచిచూస్తున్నారు. ప్రతిరోజు దాదాపు వందల సంఖ్యలో గర్భిణులు ఆస్పత్రికి వస్తున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిండు గర్భిణులు సుదీర్ఘ నిరీక్షణతో మానసిక, శారీరకంగా అలసిపోతున్నారని వారి బంధువులు వాపోతున్నారు. ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నా.. ఆస్పత్రి స్థాయిలో సరైన సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి సౌకర్యాలు కల్పించాలని గర్భిణులు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించేలా చూడాలి



**అక్షరటుడే, బీర్కూర్:** మండల పరిధిలో వెంటనే ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించేలా చూడాలని ఎంపీడీవో మహబూబ్ పేర్కొన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణాలు ప్రారంభించిన వెంటనే బేస్‌మెంట్ లెవెల్ వరకు పనులు పూర్తిచేసి వచ్చేవారం లోపు ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం ఒక ఇంటిని గృహప్రవేశానికి సిద్ధం చేయాలని సూచించారు. రోజూ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించి ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెలాఖరుకల్లా ఇంటి పన్ను వసూళ్లలో 100 శాతం సాధించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మండలంలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## వాటర్ ట్యాంక్‌ను వెంటనే కూల్చివేయాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం అంకోల్ గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని.. వెంటనే కూల్చివేయాలని గ్రామస్థులు కోరారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి సౌందర్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 30 ఏళ్లక్రితం నిర్మించిన ఈ ట్యాంకు ప్రస్తుతం పగుళ్లు ఏర్పడి, ఎప్పుడైనా కూలిపోయే స్థితిలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం సంభవించకముందే ట్యాంక్‌ను కూల్చివేయాలని, ప్రజల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చందూరి హన్మాండ్లు, మాజీ సర్పంచ్ మైసబోయి, పోశయ్య, సాకేత్, రవికాంత్, సాయిలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐ శ్రీధర్‌కు సన్మానం



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన తుల శ్రీధర్‌ను బోర్లం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న సీఐ మండలి అశోక్‌ను సైతం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పట్లోళ్ల దేవేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మంద శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రమేష్, మాజీ ఉపసర్పంచ్ మమ్మయి కాశీరాం, సాయికిరణ్, గుజ్జరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## పొలాల్లోకి దూసుకెళ్లిన వీసీ కారు..




**అక్షరటుడే, డిచ్‌పల్లి :** తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్‌కు వచ్చే దారిలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. యూనివర్సిటీ వీసీకి చెందిన కారు డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వస్తోంది. అయితే మాధవనగర్ బైపాస్ వద్ద కారుకు ముందున్న వాహనం సడెన్ బ్రేక్ వేయడంతో తప్పించే ప్రయత్నంలో కారులో పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో కారులో వీసీ యాదగిరిరావు లేరు డ్రైవర్ ఒక్కరే ఉన్నారు. అయితే ఆయనకు సైతం ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## స్కూల్ బస్సు కిందపడి బాలుడి దుర్మరణం

**అక్షరటుడే, భీమ్‌గల్ :** స్కూల్ బస్సు కిందపడి మూడేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన భీమ్‌గల్ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కృష్ణవేణి పాఠశాల బస్సు విద్యార్థులను తీసుకెళ్లేందుకు రహత్ నగర్ గ్రామానికి మంగళవారం ఉదయం వచ్చింది. ఇదే సమయంలో తన అన్న స్కూల్ బస్సు ఎక్కేందుకు వెళ్తుండగా కుటుంబసభ్యులతో పాటు బస్సు దగ్గరికి వచ్చిన బాలుడు బస్సు ముందుకు వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించని డ్రైవర్ బస్సును ముందుకు తీసుకెళ్లడంతో బాలుడు బస్సుకింద పడి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబీకులు హుటాహుటిన బాలుడిని నిజామాబాద్ జిల్లా కేంద్రానికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# సమీకృతం.. అసంపూర్ణం..!

కూరగాయల వ్యాపారులకు కష్టాలు తప్పడం లేదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన కూరగాయల పంట చేతికి వచ్చేదాకా నమ్మకం లేని పరిస్థితి నెలకొంటుండగా.. చేతికి వచ్చిన కూరగాయలను అమ్ముకోవడానికి నిలువ నీడ లేకుండా పోతుంది. రైతుల కోసం కామారెడ్డిలో రైతు బజార్ నిర్మాణ పనులు చేపట్టగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. సమీకృత మార్కెట్ పనులు పిల్లర్ల దగ్గరే ఆగిపోయాయి. దీంతో కూరగాయలు రైతులు రోడ్ల పై అవస్థలు పడుతున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి

- నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు
- రీ డిజైన్ తో రూ.7 నుంచి 11 కోట్లకు పెరిగిన అంచనా విలువ
- విడుదల కాని నిధులు
- కామారెడ్డిలోనూ ఇదే పరిస్థితి
- రూ.50 లక్షలతో నిర్మించిన రైతుబజార్ వృథా

పట్టణంలో నాలుగేళ్ల క్రితం రైతుబజార్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేసింది. గత ప్రభుత్వ హయాంలోనే రైతుబజార్ నిర్మించి ప్రారంభోత్సవం చేసినా.. కొద్దిరోజుల పాటు రైతులు అందులో కూరగాయలు విక్రయించారు. అయితే కూరగాయలతో పాటు ఇతర వస్తువులు కూడా లభించే వ్యాపారుల వద్దకే ప్రజలు వెళ్లడంతో రైతు బజార్‌లోకి వినియోగదారులు రావడం లేదని, రైతులు కూడా వ్యాపారుల పక్కనే కూర్చుని విక్రయించడం మొదలు పెట్టారు. అలాగే రాత్రయితే రైతుబజార్ వద్ద భద్రత కూడా లేకపోవడంతో భయంతో అక్కడ కూరగాయలు అమ్మడం మానేశారు. దీంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన రైతుబజార్ వృథాగా మారింది. ప్రస్తుతం ఆ రైతుబజార్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

### రూ.7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్..

పట్టణ ప్రజలకు కూరగాయలతో పాటు చికెన్, మటన్, చేపలు, ఇతర వస్తువులన్నీ ఒకేచోట లభించేలా ప్రభుత్వం రూ. 7.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మంజూరు చేసింది. 2021 ఆగస్ట్ 28 న మార్కెట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేయగా పనులు మొదలయ్యాయి. అయితే నిధులు విడుదల కాకపోవడంతో పిల్లర్ల స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి.

### రీ డిజైన్‌తో రూ.11 కోట్లకు..

రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ డిజైన్లను ప్రభుత్వం మార్చింది. కొత్త డిజైన్ తయారు చేసి ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించగా, కామారెడ్డి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూడా రీ డిజైన్ చేసి రూ. 11 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి ఆమోదం కూడా లభించింది. అయితే నిధులు మాత్రం మంజూరు చేయలేదు.

### రోడ్లపైనే విక్రయాలు..

రైతులు కూరగాయలు విక్రయించుకోవడానికి పట్టణంలో కనీస స్థలం లేకపోవడంతో రోడ్లపైనే విక్రయిస్తున్నారు. వర్షాకాలంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. వర్షపు నీటిలో కూరగాయలు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. మామూలు రోజుల్లో కూడా ఎండలో పొద్దంతా కూర్చుని కూరగాయలు విక్రయించాల్సి వస్తోంది. మరోవైపు చేపలు, మటన్ విక్రయాలు కూడా శుభ్రత లేని ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఈగలు, దోమలతో అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు చేస్తున్నారు. ఫలితంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### నిధులు వస్తే పనులు చేపడతాం..

కామారెడ్డి పట్టణంలో రూ.7.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మంజూరైంది. ఇందులో నిర్మాణానికి రూ.4.5 కోట్లు, మిగిలినవి సౌకర్యాల కల్పన కోసం వినియోగించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. కొత్త డిజైన్ ఇవ్వాలని ఆదేశిస్తే రూ.11 కోట్లతో పంపిన రీ డిజైన్‌కు ప్రభుత్వం అనుమతివచ్చింది. కానీ నిధులు రాలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పనులు చేపడతాం.

– సంతోష్, పబ్లిక్ హెల్త్ డీఈ, కామారెడ్డి

## విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం

**అక్షరటుడే, ధర్పల్లి:** ధర్పల్లి మండలంలోని చల్లగరిగె జడ్పీహెచ్‌ఎస్‌లో శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో సుమారు 120 మంది విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం దంతాలను శుభ్ర పర్చుకునే విధానంపై విద్యార్థులకు వైద్యులు అవగాహన కల్పించారు. దంతాల్లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని వారు వివరించారు. కార్యక్రమంలో శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## జర్నలిస్టులపై పోలీసుల తీరు సరికాదు

**అక్షరటుడే, ఆర్మూర్:** జర్నలిస్టులపై పోలీసుల వ్యవహార శైలిని ఖండిస్తున్నామని ఆర్మూర్ ప్రెస్ క్లబ్, నవనాథపురం ప్రెస్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్‌కు మంగళవారం జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. పట్టణానికి చెందిన జర్నలిస్టులపై కానిస్టేబుళ్లు దురుసు ప్రవర్తన కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సిబ్బంది దినేష్, అశోక్‌లు తరచూ జర్నలిస్టులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, కావాలని వాహనాలకు జరిమానాలు వేస్తున్నారని ఆరోపించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు చౌల్ సందీప్, సంజీవ్ పార్దెం, పద్మారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.





## 18న బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కోరుతూ ఈనెల 18న నిర్వహించనున్న బీసీబంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల సంఘం (ట్రస్మా), హోల్‌సేల్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతమంది అగ్రవర్ణాల వారు బీసీలకు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేసి రిజర్వేషన్లు నిలిచిపోయేలా చేశారన్నారు. దీంతో రాష్ట్ర జేఏసీ నాయకులు ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. కావున అన్నివర్గాల వ్యాపారస్తులు, విద్యాసంస్థలు తమకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగా కిషన్, దేవేందర్, శంకర్, శ్రీలత, బాలన్న, విజయ్, సాయి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ బ్రెయిన్ యోగాతో ప్రయోజనాలు



**అక్షరటుడే, ఇందల్వాయి:** 'సూపర్ బ్రెయిన్ యోగా'తో అనేక ప్రయోజనాలున్నాయని అంతర్జాతీయ ప్రచారకులు అందె జీవన్‌రావు అన్నారు. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అందె జీవన్ రావు సూపర్ బ్రెయిన్ యోగ ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థులతో గుంజీలు తీయించే పద్ధతిని మన దేశంలో శిక్షగా భావించడంతో పాఠశాలల్లో కనుమరుగైందన్నారు. కానీ, పాశ్చాత్య దేశాల్లో ఇది 'సూపర్ బ్రెయిన్ యోగాగా ప్రాచుర్యంలోకి వచ్చిందన్నారు. క్రమ పద్ధతిలో సూపర్ బ్రెయిన్ యోగా చేయడం ద్వారా జ్ఞాపకశక్తి మెరుగవుతుందని తాజా పరిశోధనలు తెలియజేస్తున్నాయన్నారు. ఈ మేరకు పరిశోధన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు విజయ్,అనిల్ కుమార్, సునంద, రూప, తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్‌లో న్యాయ చైతన్య సదస్సు

**అక్షరటుడే, బీర్కూర్:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు బీర్కూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించనునట్లు న్యాయ సేవా సంస్థ వలంటీర్ పొట్లూరి ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ సదస్సుకు అతిథులుగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి నాగరాణి, బాన్సువాడ సివిల్ కోర్టు జడ్జి భార్గవి విచ్చేస్తారని తెలిపారు. సదస్సులో ప్రజలకు న్యాయ అవగాహన, చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ న్యాయ సేవల ప్రాధాన్యంపై స్పష్టతనివ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.



## నిత్యావసర సరుకుల అందజేత

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలో ఇటీవల విద్యుత్‌షాక్‌తో నర్సింహులు, లక్ష్మణ్ మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాలకు కమ్మర్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యులు ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, ఐదు కేజీల నూనె, 5 కేజీల పప్పు, రూ.2,500 అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భోగ రామస్వామి, కోశాధికారి బుచ్చి మల్లయ్య, సభ్యులు సున్నం మోహన్, నిమ్మ ప్రసాద్ పాల్గొన్నారు.

## పటాకుల స్టాళ్లకు అనుమతి తప్పనిసరి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పటాకుల స్టాళ్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. అనుమతులు ఇచ్చాకే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమతి లేని దుకాణాలపై ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పటాకుల స్టాళ్లను ఖాళీ ప్రదేశాల్లో, నివాసాలకు, జనసంచారానికి దూరంగా ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాళ్ల దగ్గర అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.




## కులగణన కంప్యూటర్ ఆపరేటర్లకు డబ్బులు చెల్లించాలి

**అక్షరటుడే, కోటగిరి :** కులగణన సమయంలో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన కంప్యూటర్ ఆపరేటర్లకు డబ్బులు చెల్లించాలని బీఆర్ఎస్ మండల యువజన విభాగం నాయకులు గంగాప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కోటగిరి మండల కేంద్రానికి చెందిన నిరుద్యోగ యువకులు గతంలో కులగణన సమయంలో దరఖాస్తులు కంప్యూటర్లలో ఎంట్రీ చేశారన్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.30 చొప్పున అందజేస్తామని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి రుసుము చెల్లించలేదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నిరుద్యోగులు నవీన్ కుమార్, కప్ప సంతోష్, తెల్ల చిన్న అరవింద్, సమీర్, రుద్రాంగి సందీప్, యోగేష్, మహేష్, సంతోష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

**అక్షరటుడే, మెండోరా:** చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు మెండోరా ఎస్సై తెలిపారు. నెహ్రూ నగర్ కాలనీకి చెందిన అదుదుకె శ్యామ్ చోరీకి పాల్పడగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టులో మంగళవారం హాజరు పర్చగా విచారించిన ఆర్మూర్ కోర్టు మెజిస్ట్రేట్ సరళ రాణి నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై వెల్లడించారు.

## భార్య గొంతుకోసి హత్య చేసిన భర్త

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో ఓ మహిళను తన భర్త దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర కాలనీలో బాపట్లకు చెందిన భార్యభర్తలు జగదీష్, వర్ష మమత నివాసముంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. జగదీష్ కట్టె మిషన్‌లో పనిచేస్తున్నాడు. అయితే భార్యపై కొన్నాళ్లుగా అనుమానం పెంచుకున్న ఆయన మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి కత్తితో భార్య మెడకోసి హత్య చేశాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.